


# లచ్చిరెడ్డి సేవలు అభినందనీయం

* **బి.ఎన్.రెడ్డి నగర్ మాజీ**
* **మాజీ కార్పొరేటర్‌కు కాలనీవాసుల ఘన సన్మానం..**

వనస్థలిపురం, ఫిబ్రవరి 24 (భారత శక్తి): బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ దుర్గా సాయి నగర్ కాలనీ అభివృద్ధికి నిరంతరం కృషి చేసిన మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డిని కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్పొరేటర్‌గా ఐదేళ్ల పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం ఆయనను కలిసి శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా కాలనీ ప్రతినిధులు మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో కాలనీలోని మౌలిక సదుపాయాల కల్పనలో, దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంలో లచ్చిరెడ్డి ప్రత్యేక చొరవ చూపారని కొనియాడారు. ప్రజాప్రతినిధిగా ఆయన అందించిన సహకారం మరువలేనిదని పేర్కొన్నారు.

**అభివృద్ధే ధ్యేయంగా పనిచేశా:లచ్చిరెడ్డి**

అనంతరం మొద్దు లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. పదవీకాలంలో కాలనీల అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి



చేశానని తెలిపారు. కాలనీవాసులు తనపై చూపిన అభిమానానికి ధన్యవాదాలు తెలియజేశారు. భవిష్యత్తులోనూ ప్రజా సేవలో ముందుంటానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, ముఖ్య నాయకులు దామోదర్ రెడ్డి, నరసింహారెడ్డి, ఎల్లయ్య, యాదగిరి గౌడ్, భాస్కర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, ముత్యాలు, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమానత్వం అనే వాదన
# ఎప్పటికైనా నిజం అవుతుందా..?



బోయనపల్లి రమణారావు
9390267118

భారత దేశం లో ఉద్యోగాలు, ఉన్నత విద్యా అవకాశాల విషయంలో "కులాల ఆధారంగా రిజర్వేషన్లు కొనసాగాలా? లేక ఆర్థికంగా వెనుకబడిన వారందరికీ కులభేదం లేకుండా సహాయం చేయాలా?" అన్న చర్చ మరోసారి వేడెక్కుతోంది. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, చారిత్రక అన్యాయం సరిదిద్దడం.. ఈ మూడు అంశాల మధ్య సమతౌల్యం ఎలా సాధించాలి అన్నదే అసలు ప్రశ్న. భారత రాజ్యాంగ నిర్మాతలు సామాజికంగా వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు అవసరమని భావించారు. అందుకే రాజ్యాంగం లోని ఆర్టికల్స్ 15(4), 16(4) ద్వారా సామాజిక మరియు విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించేందుకు అవకాశం ఇచ్చారు. బి ఆర్ అంబేద్కర్ నాయకత్వంలో రూపొందిన విధానాలు, శతాబ్దాలుగా అణచివేతకు గురైన వర్గాలకు ప్రభుత్వ రంగంలో ప్రతినిధిత్వం కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఇది కేవలం పేదరికం సమస్య కాదు; సామాజిక వివక్ష, వృత్తి ఆధారిత బంధనలు, విద్యా అవకాశాల నిరాకరణ వంటి చారిత్రక అన్యాయాల సరిదిద్దే ప్రయత్నం. గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా కులవివక్ష, అడ్డంకులు కనిపిస్తున్నాయని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. కేవలం ఆర్థిక సహాయం ఇచ్చి ఈ సామాజిక అవరోధాలను తొలగించడం సాధ్యం కాదని వాదన. ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత విద్యలో అన్ని వర్గాలకు సముచిత ప్రతినిధిత్వం ఉండాలని భావన. శతాబ్దాలుగా అవకాశాలు దూరమైన వర్గాలకు సమాన స్థాయికి చేరుకునే వరకు ప్రత్యేక చర్యలు అవసరమని అభిప్రాయం. పేదరికం అన్ని కులాల్లో ఉంది. కాబట్టి ఆర్థికంగా వెనుకబడిన వారందరికీ సహాయం చేయాలి. కొందరు వాదన ప్రకారం, కొన్ని వర్గాల్లో ఆర్థికంగా బలమైనవారు కూడా రిజర్వేషన్ల లబ్ధి పొందుతున్నారు. కుల ఆధారిత విధానాలు విభజన భావన పెంచుతాయని విమర్శ. ఇటీవలి కాలంలో కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా బలహీన వర్గాలకు 10% రిజర్వేషన్ అమలు చేయడం ఈ వాదనకు ఒక ఉదాహరణగా పేర్కొనబడుతోంది. భారత సుప్రీంకోర్టు పలు తీర్పుల్లో రిజర్వేషన్ల ఉద్దేశ్యం "సామాజిక మరియు విద్యా వెనుకబాటుతనం" అని స్పష్టం చేసింది. అంటే కేవలం పేదరికమే ప్రమాణం కాదు; సామాజిక వెనుకబాటుతనం కూడా కీలకం.

సామాజిక వెనుకబాటుతనం + ఆర్థిక బలహీనత — రెండు ప్రమాణాలను కలిపిన సమగ్ర విధానం అవసరం.

నిజంగా అవసరమైనవారికి చేరేలా లబ్ధిదారుల గుర్తింపు వ్యవస్థ బలోపేతం కావాలి. విద్యలో నాణ్యత, గ్రామీణ మౌలిక సదుపాయాలు మెరుగుపరిచితే రిజర్వేషన్లపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. కులాల ఆధారంగా రిజర్వేషన్లు అవసరమా? లేక ఆర్థిక ప్రమాణమే సరిపోతుందా? అన్నది సున్నితమైన సామాజిక రాజకీయ ప్రశ్న. చారిత్రక అన్యాయం సరిదిద్దడమా? లేక ప్రస్తుత పేదరికం నివారణామా? ఈ రెండింటి మధ్య సమతౌల్యం కనుగొనడం ప్రభుత్వాల ముందున్న సవాలు. సమాజంలో నిజమైన సమానత్వం నెలకొల్పాలంటే, కేవలం విధానాలు కాకుండా, అవి అమలు అయ్యే విధానం కూడా పారదర్శకంగా, న్యాయంగా ఉండాలి. అప్పుడే "సమాన అవకాశాలు" అనే రాజ్యాంగ వాగ్దానం సార్థకం అవుతుంది.

# ఆపదలో అండగా.. హైడ్రా 'యువ ఆపద మిత్ర'!

* **విపత్తు నిర్వహణలో వాలంటీర్లకు హైడ్రా పెద్దపీట.**
* **శిక్షణ పూర్తి చేసుకున్న 105 మందికి ధ్రువపత్రాల అందజేత**
* **నియామకాల్లోనూ ప్రాధాన్యత: కమిషనర్ ఏవీ రంగనాథ్ వెల్లడి.**

హైదరాబాద్ ఫిబ్రవరి 24 (భారతశక్తి): నగరానికి ఏదైనా ఆపద వస్తే.. ప్రభుత్వ యంత్రాంగం కంటే ముందే స్పందించే 'తొలి రక్షకులు' (ఫస్ట్ రెస్పాండర్స్)గా యువతను తీర్చిదిద్దేందుకు హైడ్రా నడుం బిగించింది. 'యువ ఆపద మిత్ర' పథకంలో భాగంగా కఠిన శిక్షణ పూర్తి చేసుకున్న వాలంటీర్ల సేవలను విపత్తుల సమయంలో పూర్తిస్థాయిలో వినియోగించుకోనున్నట్లు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రకటించారు. మంగళవారం ఫతుల్‌గూడలోని శిక్షణ కేంద్రంలో వారం రోజుల శిబిరాన్ని ముగించుకున్న 105 మంది వాలంటీర్లకు రంగనాథ్ గారు ధ్రువపత్రాలను అందజేశారు.

* **ప్రమాద సమయాల్లో చురుకైన పాత్ర:**

హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన యువత ఫిబ్రవరి 18 నుంచి 24 వరకు విపత్తు నిర్వహణపై ప్రత్యేక శిక్షణ పొందారు. భారీ వర్షాలు, వరదలు సంభవించినప్పుడు ప్రజలను




సురక్షిత ప్రాంతాలకు తరలించడం, ప్రాథమిక చికిత్స అందించడం వంటి కీలక అంశాలపై వీరికి అవగాహన కల్పించారు. మరో పది మందికి స్ఫూర్తిగా: శిక్షణ పొందిన ప్రతి వాలంటీర్ తన పరిధిలోని మరో పది మందిని సిద్ధం చేయాలని, తద్వారా విపత్తు సమయాల్లో స్థానికులకు భరోసా కల్పించాలని కమిషనర్ సూచించారు. ఉపాధిలో ప్రాధాన్యం: హైడ్రా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (DRF)లో భవిష్యత్తులో చేపట్టే నియామకాల్లో ఈ వాలంటీర్లకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు.

**పర్యావరణ పరిరక్షణే లక్ష్యం:**

కేవలం సహాయక చర్యలకే పరిమితం కాకుండా, పర్యావరణ హితమైన నగర నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని రంగనాథ్ పిలుపునిచ్చారు.

**"నగరాన్ని వరద ముప్పు నుంచి తప్పించడమే హైడ్రా ప్రధాన లక్ష్యం. ఇందులో భాగంగానే చెరువులు, నాలాల పునరుద్ధరణ చేపడుతున్నాం. ప్రభుత్వ భూములు, పార్కుల పరిరక్షణలో యువత సామాజిక బాధ్యతతో వ్యవహరించాలి."**

**— ఏవీ రంగనాథ్, హైడ్రా కమిషనర్**

* **నాడు భయం.. నేడు ధైర్యం!**

శిక్షణ పొందిన వాలంటీర్లు తమ అనుభవాలను పంచుకుంటూ.. "గతంలో విపత్తుల సమయంలో ఏం చేయాలో తెలియక భయపడేవాళ్లం. కానీ ఈ వారం రోజుల శిక్షణ మాలో ఆత్మవిశ్వాసాన్ని నింపింది. హైడ్రా అభివృద్ధి చేసిన చెరువులను చూశాక పర్యావరణంపై మాకు అవగాహన పెరిగింది. సమాజానికి సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నాం" అని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్ నాగోల్ ప్రాంతంలోని ఫతుల్‌గూడ శిక్షణ కేంద్రం కార్యక్రమంలో పాల్గొన్న వారు అదనపు కమిషనర్ ఆర్. సుదర్శన్, అదనపు డైరెక్టర్ వర్ల పాపయ్య తో పాటుగా హైడ్రా సిబ్బంది హైదరాబాద్ రంగారెడ్డి జిల్లాల నుండి 105 మంది వాలంటీర్లు పాల్గొన్నారు.





# ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచండి

: **జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ఆదేశం**

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (భారత శక్తి) : నగరంలో ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు చేపట్టిన ఎస్ఆర్‌డీపీ, హెచ్‌సిటీ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో జోనల్ కమిషనర్లు, ప్రాజెక్టు ఇంజనీర్లు, ప్లానింగ్, ఇరిగేషన్, భూసేకరణ అధికారులతో కలిసి ఆయన కీలక ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు.

**సమావేశంలో ముఖ్యాంశాలు:**

జూన్ 2 లోపు పూర్తి కావాలి: ముసారాంబాగ్ హై లెవెల్ బ్రిడ్జి, నల్గొండ ఎక్స్ రోడ్ ఫ్లైఓవర్ పనులను 'మిషన్ మోడ్'లో చేపట్టి, జూన్ 2వ తేదీ నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

* అడ్డంకులు తొలగించండి: పనులకు నిధుల కొరత లేదని, యుటిలిటీ షిఫ్టింగ్ (పైప్‌లైన్లు, విద్యుత్ తీగలు మార్చడం), పెండింగ్ భూసేకరణ ప్రక్రియలను తక్షణమే పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వం వద్ద ఏవైనా అంశాలు పెండింగ్‌లో ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు.
* కేబీఆర్ పార్క్ పనులు: కేబీఆర్ పార్క్ పరిసరాల్లో చేపట్టిన ప్రాజెక్టు పనులు వేగంగా సాగేలా చూడాలని, నిర్మాణ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులతో సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు.
* క్షేత్రస్థాయి పరిశీలన: ఎస్ఎన్‌డీపీ (SNDP) కింద చేపట్టిన వరద కాలువల పనులు, ఇతర ఇంజనీరింగ్ సవాళ్లపై అధికారులు కమిషనర్‌కు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ఈ సమీక్షా సమావేశంలో జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, ముకుంద రెడ్డి, చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్, ప్రత్యేక ఉప కలెక్టర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# చెత్త సేకరణపై 'క్యూఆర్' నిఘా

* **పైలట్ ప్రాజెక్టును పరిశీలించిన జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి కర్ణన్**

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (భారతశక్తి): నగరంలో ఇంటింటా చెత్త సేకరణ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ప్రయోగాత్మకంగా చేపట్టిన 'క్యూఆర్ కోడ్' ఆధారిత విధానం సత్ఫలితాలనిస్తుందని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ పేర్కొన్నారు. ఈ విధానం ద్వారా పారిశుద్ధ్య నిర్వహణలో జవాబుదారీతనం పెరుగుతుందని, ప్రతి ఇల్లు కవర్ అయ్యేలా పర్యవేక్షించవచ్చని స్పష్టం చేశారు. రాజేంద్రనగర్ జోన్, అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని హైదర్‌గూడ నలందానగర్‌లో కొనసాగుతున్న క్యూఆర్ కోడ్ ఆధారిత చెత్త సేకరణ పైలట్ ప్రాజెక్టును మంగళవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, అదనపు కమిషనర్ (శానిటేషన్) రవికిరణ్, డిప్యూటీ కమిషనర్ సమ్మయ్యతో కలిసి స్వచ్ఛ ఆటోల పనితీరును, చెత్త సేకరణ తీరును ఆకస్మికంగా తనిఖీ చేశారు.

* **అధికారులకు కమిషనర్ జారీ చేసిన కీలక ఆదేశాలు:**



* నిరంతర పర్యవేక్షణ: ప్రతిరోజూ తప్పనిసరిగా ఇంటింటా చెత్త సేకరించేలా డిప్యూటీ కమిషనర్లు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఇంజనీర్లు పర్యవేక్షించాలి.
* నిర్లక్ష్యంపై హెచ్చరిక: పారిశుద్ధ్య కార్మికుల హాజరు, పనితీరులో అలసత్వం వహించినా, సూపర్వైజర్ల పర్యవేక్షణ లోపించినా కఠిన చర్యలు తప్పవు.
* ప్రజల్లో అవగాహన: స్వచ్ఛ ఆటోలకు చెత్త ఇవ్వని గృహాలను గుర్తించి, వారిని చైతన్యపరచాలి. ప్రజల భాగస్వామ్యంతోనే నగరం పరిశుభ్రంగా ఉంటుందని గుర్తించి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి.
* త్వరితగతిన పరిష్కారం: పారిశుద్ధ్య సమస్యలపై ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి పరిష్కరించాలి.

నగరం అంతటా అమలుకు ప్రణాళిక:
ఈ పైలట్ ప్రాజెక్టు ఫలితాలు సానుకూలంగా ఉంటే, రాబోయే రోజుల్లో జీహెచ్‌ఎంసీ వ్యాప్తంగా అన్ని డివిజన్లలో క్యూఆర్ కోడ్ విధానాన్ని అమలు చేసేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

# మాదాపూర్‌లో రూ.300 కోట్ల స్థలం కాపాడిన హైడ్రా

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (భారతశక్తి): నగరంలో అక్రమార్కుల చేతుల్లో కబ్జాకు గురవుతున్న పార్కులు, ఓపెన్ ప్లేస్‌లు, కామన్ ల్యాండ్‌ను రక్షించేందుకు హైడ్రా (HYDRA) ఉక్కుపాదం మోపుతోంది. ఈ క్రమంలో తాజాగా మాదాపూర్ పరిధిలోని కాకతీయ హిల్స్‌లో సుమారు రూ.300 కోట్ల విలువైన 4,090 చదరపు గజాల పార్కు స్థలంతో పాటు ఇతర కామన్ ల్యాండ్‌ను హైడ్రా కాపాడింది. నకిలీ పత్రాలతో ఈ భూములను కబ్జా చేయడానికి కొందరు ప్రయత్నించడంతో, స్థానిక అసోసియేషన్ హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేసింది. దీంతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు, సంబంధిత రెవెన్యూ రికార్డులను పరిశీలించి, అక్రమ కబ్జాలపై చర్యలు చేపట్టారు. కబ్జాకు గురయ్యే ప్రమాదంలో ఉన్న స్థలాలకు కంచె ఏర్పాటు చేసి రక్షణ కల్పించారు. 1979 నాటి లేఅవుట్ నిబంధనల ప్రకారం ఈ బహిరంగ ప్రదేశాలు ప్రజావసరాల కోసం కేటాయించినవని అధికారులు స్పష్టం చేశారు. ఈ చర్యలతో స్థానికులు హైడ్రా అధికారులను అభినందిస్తూ, భవిష్యత్తులోనూ ఇలాంటి అక్రమాలపై కఠిన చర్యలు కొనసాగించాలని కోరుతున్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.